# వాదం! వేదం!

— చివుకుల పురుషోత్తం

ఈ కథ రాయాలా వద్దా? అని చాలా సంవత్సరాలు తర్జన భర్జనలను నాలో నేను చేసుకుని, ప్రతిసారి రాయకూడదు అనే నిర్ణయం రావడంతో ఈ కథను, దీనిలోని ప్లాటును నా ఇతర రచనలలో దూరకుండా నా మస్తిష్కంలో వో మారుమూల ప్రాంతంలోనే విసిరి వేశాను!

అయినా—ఈ ప్లాటు వ్యాస రూపంలోనో, కథ రూపంలోనో బయటపడి పాఠకులను అలరించాలని చాల సంవత్సరాలుగా గొడవ చేస్తున్నది! దీని గొడవ తట్టుకోలేక, ఆఖరుకు దీన్ని పాఠకుల ముందు ఉంచవలసి వస్తున్నది.

అయితే ఈ ప్లాటుకూ, సిద్ధ పురుషులకూ సన్నిహిత సంబంధం ఉంది! ఈ ప్లాటు యొక్క ఆత్మను సిద్ధపురుషులూ, ఋషులూ ప్రాచీన శాస్త్రాలలో మరుగుగా రాశారు. వారి అభిలాష మేరకు ఈ కథలో మర్మగులు కొన్ని పెట్టవలసి వచ్చింది! అందువల్లనే ఈ ప్లాటులో అత్యంత అతిశయోక్తులుగా కనబడే పచ్చి నిజాలున్నాయి. పచ్చి నిజాలుగా కనబడే అతిశయోక్తులున్నాయి! ఏవి ఏవో రూఢ్యర్థంగా గ్రహించాలంటే, ఆ సిద్ధపురుషుల, ఋషీశ్వరుల అనుగ్రహం కావాలి! లేకుంటే అంతా గంద్రగోళం...పచ్చి నిజాలు మూఢ భావాలుగా కనబడ్తాయి! మూఢభావాలుగా కన్పించేవి పచ్చి నిజాలు కావచ్చు.

ఇక అసలు కథకు వస్తే!

దాదాపు రెండు దశాబ్దాల క్రింద—

ఒకసారి—

నాకు పచ్చకామెర్ల వ్యాధి వచ్చింది.

దేవుడు లేడు! పైపైన సర్వమైన సత్య స్వరూపాన్ని దర్శింప చేయగలదు! అల్లోపతీ వైద్యం నివారించలేని జబ్బు ప్రపంచంలో లేదు! ఆంగ్ల విద్యవల్ల నాలో పేరుకొనిపోయిన ఈ ఆధునిక మూఢనమ్మకాలు పట్టు సడలి, జారిపోతూ—పోలేక అవస్థ పడుతున్న రోజులవి!

అయినా, వారం రోజులపాటు అల్లోపతి వైద్యాన్ని చేయించుకున్నాను. రోగ లక్షణాలు దినదిన ప్రవర్ధమానం అవుతున్నాయి గాని తగ్గడంలేదు.

అప్పుడే నా బుర్ర తిరిగిపోయే సంఘటన ఒకటి జరిగింది. ఆరోజు హాస్పిటల్‌లో మందు తీసుకొని వస్తుంటే— హాస్పిటల్ అంటే— ఒక ఎమ్. బి. బి. ఎస్. గారి ఇల్లు—ఒక అంబాసడర్ కారు హాస్పిటల్‌లో ప్రవేశిస్తున్నది. అందులో పాతికేండ్ల యువతి. ఆమె ఒడిలో నలతగా ఉన్న ఏడాది బేబి!

ఎందువల్లో ఆ కారంటే క్యూరియాసిటీ ఏర్పడింది, బహుశా ఆ బేబీగూడా నాలాగా కామెర్ల వ్యాధితో బాధపడుతూందన్న ఇన్‌ట్యూషన్‌వల్ల కాబోలు!

ప్రక్కన ఉన్న పేషెంట్ నడిగాను— ఆ కారును గురించి.

చెప్పాడు ఆ పేషెంట్.

"డాక్టర్‌గారి కూతురూ! ఆయన మనమరాలూ! పాలెం వెళ్ళి పాప కొచ్చిన పచ్చకామెర్లకు మంత్రం వేయించుకొస్తున్నారు"

నా నెత్తిన పిడుగు పడినట్లయింది! నిజంగా! ఆ పిడుగుపాటులో నాలోని ఆధునిక మూఢ నమ్మకాలు—కరిగిన వెండిపైన నేత జరుగగా కొద్దిపాటి బంగారం మిగిలి, మిగిలిన క్షుద్రలోహం మాయం అయినట్లుగా, కొద్దిపాటి స్వచ్ఛమైన విజ్ఞానం మిగిలి, ఎక్కువపాటి మూఢ నమ్మకాలు హరించుకొన్నట్లయింది.

అనాడే స్వచ్ఛమైన విజ్ఞాన స్వరూపం బోధపడింది!

ఈ ప్రపంచంలో మనకేవీ సర్వసన్నద్ధంగా, సత్వరానుభవయోగ్యంగా చిక్కవు. కదళీఫలంలాంటి సత్వరానుభవయోగ్యమైన పండుకు గూడా తోలు తియ్యాలి! పండుతినాలి. నారింజకాయకు తొక్కలు తీసి, బద్దలోని గింజలనూ, తొక్కనూ వేరుచేసి రసం తాగాలి.

అలాగే గ్రంథస్థమైన విజ్ఞానం కూడా కొంత. అజ్ఞానంతో కొంత తెరమరుగుగా ఉంటుంది. దానిని స్వప్రయత్నంతో, గురుకృపతో పరిష్కరించుకొని స్వచ్ఛమైన విజ్ఞానం పొందాలి. లేకుంటే మన శక్తి చాలదు అనుకోవాలి గాని, అది అబద్ధం అనరాదు. ఇలా అనుకుని నాలుగు ఆదివారాలు నేనూ, ఆ డాక్టరుగారి మనుమరాలూ, మరెంతోమందితో బాటు ఆ పాలెం వెళ్ళి మంత్రం వేయించుకున్నాం.

నాకు వ్యాధి తగ్గింది. (పాప సంగతి తెలియదు!)

అనాటినుండీ ప్రాచీన శాస్త్రాలుగా చెలామణి అయ్యే మూఢ నమ్మకాలనూ, మూఢనమ్మకాలనబడే శాస్త్రాలనూ విచక్షణారహితంగా నమిలివేయడం ప్రారంభించాను.

అలా చేయడంలో 'అరగనివీ, కొద్దిగా అరిగినవీ, అస్సలు కొరుకుడు పడనివీ' అనేక విషయాలు నాలో పేరుకొనిపోయాయి.

వాటిల్లో మూలికా వైద్యం ఒకటి.

వాటిల్లో తెల్లచోడవరం, కృష్ణభృంగ, ఈశ్వరీ వల్లి అనేవి మూడు మహా సిద్ధిమూలికలు. వీటి అన్వేషణను ఏండ్ల తరబడి చేసినా, కనీసం వాటిని చూసినవాడైనా చిక్కలేదు. అవి ఈ సృష్టిలో లేవు. ఆ మూలికలు అభూత కల్పనలు. వాటిలో ఉన్నట్లు చెప్పబడుతున్న శక్తులు అబద్ధాలూ అన్న ఆలోచనలు—'పుణ్యాత్ములకే గాని పాపాత్ములకు అవి కనబడవు' అన్న శాస్త్ర నియమంవల్ల నిరాశా నిస్పృహలు ఎక్కువవుతున్న తరుణంలో...

ఒకసారి...

అప్పటికి కనీసం వో యాభైమార్లన్నా వెళ్ళిన ఒక దివ్యక్షేత్రానికి మళ్ళీ వెళ్ళాను.

యథావిధిగా క్షేత్రపాలకునికీ, క్షేత్రపాలికకూ పూజలు జరిపించి, నే వొచ్చిన ప్రతిసారి నన్ను కలుసుకునే వ్యక్తికోసం చూశాను. అతని జాడ కనిపించకపోవడంతో, అతడుండే పల్లెకు బయలుదేరి వెళ్ళి అతని గుడిసెలో తొంగిచూశాను. గుడిసెలో మంచం మీద అతడు పడుకుని ఉన్నాడు.

"వీరన్నా!" అని పిల్చాను.


ఒకటి రెండుసార్లు పిలవగా, అతడు "ఎవరూ?" అంటూ అతి నీరసంగా లేచి నన్ను చూసి "రండి, బాబూ! జొరంగా ఉంది!" అన్నాడు. అతడు ఎనభై ఏళ్ళ ముసలివాడు!

నేను వెళ్ళి అతడి ప్రక్కన మంచంమీద కూర్చున్నాను.

"బాబూ! మూలికలకోసం వచ్చావా?"

అతడి ప్రశ్నకు మౌనమే సమాధానంగా ఇచ్చి, అతడ్ని పరిశీలిస్తున్నాను.

అతడు ఎనభై సంవత్సరాల వ్యక్తి అయినా, పోయినసారికంటే ఇప్పుడు చాలా ముసలివాడిలాగా



కనిపిస్తున్నాడు. నీరసంతో చాలా కృశించిపోయి వాడు. ఎన్నో సంవత్సరాలు వైద్యం చేసిన అనుభవంతో అతని ముఖంలోకి చూస్తే మృత్యుదేవత అతడ్ని కనికరించే వేళ ఇంకా చాలా దూరం ఉన్నట్లు కనుపించింది.

''సింగమ్మ ఏది?'' (సింగమ్మ అంటే అతడి భార్య—75 ఏళ్ళు!)

''సచ్చిపోయింది, బాబూ!''

నా గుండె తరుక్కుపోయింది.

కొద్ది సేపటికి తేరుకున్నాను. అతని దేహాన్ని పట్టుకుని చూశాను జ్వరం కాలిపోతూంది. ఆ గుడిసెలో ఉన్న పాత్రలన్నీ ఖాళీగా కనుపిస్తున్నాయి.

''ఈరోజు ఏమైనా తిన్నావా?''

వీరన్న సన్నగా, ఎండుగా నవ్వి ''ఆనలేదు!'' అన్నాడు.

''నిన్న?''

'' . . . . . . . ''

''మొన్న?''

''మొన్న. . . తంగేడాకు, చిర్రికూర కలిపి వండుకు తిన్నాను!''

''మరి నీ పిల్లలు డబ్బు పంపలేదా?''

''అలిశం అయింది! ఏదీ? వాళ్ళమ్మ కర్మాంతరాలకు శావా తగలేశారుగదా!''

వాల్మీకి కులంలో పుట్టిన వీరన్న నలుగురు కుమారులూ, చదివిన కొద్ది చదువుకే మంచి ఉద్యోగాలలో ఉన్నా, తండ్రికి తిండికి పంపలేనంతటి దరిద్రులు కారు! అయినా ఎవడూ డబ్బు పంపలేదు.

''బాబూ! రెండ్నెల్లనుండీ ఒక్కడు గూడా మూలికలకు రాలేదు.''

వీరన్నకు అక్కడున్న అడివిలోని నేపాళ, ఈశ్వరి, నేలతంగేడు, నేలవేము, నాభి, వస మొదలైన మూలికలు తెలుసు. అప్పుడప్పుడు కొంతమంది వచ్చి వీరన్నకు డబ్బిచ్చి అతనిచేత మూలికలను తెప్పించుకుంటుంటారు.

ఉన్నట్టుండి లేచాను.

''ఉండు, బాబూ! పొబాకు!'' అని వీరన్న నన్ను వారించాడు—దీనంగా.

''పది నిముషాలలో వస్తాను'' అంటూ వీరన్న వారింపును లెక్కచేయకుండా గుడిసె వెలుపలికి వచ్చి, అక్కడికి రెండు కిలోమీటర్లున్న కొద్దిపాటి వూరికి బయలుదేరాను.

ఆ వూరు చేరి, అక్కడ ఉన్న చిన్న మందుల షాపులో కొన్ని మాత్రలు, హార్లిక్సు సీసా, రొట్టెలూ, కొన్ని పండ్లూ తీసుకుని వీరన్న దగ్గరకు వచ్చారు.

గుడిసెలో పిడుత నొకదానిని తీసుకుని, అందులో నీళ్ళు పోసి హార్లిక్స్ కలిపి, మరో పిడుతలో దానిని పోసి, వీరన్న దగ్గరకొచ్చి అతడిచేత మందుబిళ్ళను మింగించి, హార్లిక్స్ తాగించాను.

''ఎందుకు, బాబూ, నీకీ కష్టం?'' అని వీరన్న సణుగుతూనే ఉన్నాడు.

''ఇక మవునంగా పడుకో! జ్వరం తగ్గిపోతుంది'' అంటూ నేను గుడిసె వెలుపలకు వచ్చి అక్కడకు దూరంగా ఉన్న ఒక చెట్టుక్రింద కూర్చుని వీరన్నను గురించి ఆలోచిస్తున్నాను.

'ఎంత చిత్రం? ఆయుర్వేద మూలికలను సేకరించి కారుచౌకకు అమ్ముకుని జీవించే వీరన్నకు ఈనాడు అల్లోపతి బిళ్ళవల్ల జ్వరం తగ్గవలసిన యోగం పట్టింది. కారణం? అతడికి ఆ మూలికల ప్రభావం తెలియకపోవడమే! ఆయా చెట్లను గుర్తుపట్టే కావలసిన వాళ్ళకు వాటిని ఇవ్వడమే అతనికి తెలుసు.

ఇక శేష జీవితాన్నితడు ఎలా గడపగలడు ? వార్ధక్యం బెబ్బులిలాగా అతడిపైన బడింది. ఇంక ముందు ఇతడు అడవులలో కొండలపైన, బండల పైన తిరిగి మూలికలు సేకరించగలడా? ప్చ్!

వూహు ! ఇక ఇతను శేష జీవితాన్ని నిశ్చింతగా గడపడాని కొకటే మార్గం ఉంది. ఇక్కడ దొరికే మూలికలు ఏమేం పనులు చేస్తాయో ఇతడికి తెలిపితే, ఈపాటి కొద్ది వైద్యానికే ఇక్కడ ఇతడికింత గంజి దొరుకుతుంది.

అలా చేయాలి అనుకుని అప్పటికి వీరన్న మందు మ్రింగి అరగంట కావడంవల్ల గుడిసెలో కెళ్ళి అతడ్ని చూశాను. వీరన్నకు ఒళ్ళంతా దిగ చెమట పట్టింది. అతడు చెమట బాధకు అటూ ఇటూ మెదులుతున్నాడు.

''వీరన్నా! బాగా చెమటపట్టింది! లే! మంచం వాకిట్లో వేస్తాను!'' అన్నాను.

వీరన్న మెల్లగా లేచి నిలబడ్డాడు.

నేను మంచాన్ని తీసుకుని గుడిసె వెలుపల వేశాను. వీరన్నను వాకిట్లో మంచంమీదకు చేర్చి ''వీరన్నా, పడుకో! చెమట ఆరిపోగానే జ్వరం తగ్గిపోతుంద'' దని చెప్పి మళ్ళీ గుడిసెలో కెళ్ళి హార్లిక్స్ చేసి పట్టుకొచ్చి ఇచ్చాను.

వీరన్న హార్లిక్స్ త్రాగి అన్నాడు—''బాబూ ! నీవు పతిసారీ వచ్చే బాబువు కాదు! ఈ అడవి, ఈ కొండల్ని ఏలుతున్న ఆ పరమేస్వరుడే నీ రూపంలో వచ్చాడు! నీవు...నీవుగాదు...ఆ పరమేస్వరు...డే!''

ఒక్క లిప్తకాలం నాలో ఆనందం పెల్లుబికింది.

ఆ తరువాత నాలుగు రోజులపాటు వీరన్నతో బాటే నేనూ ఉన్నాను.

ఆ అడవిలో దొరికే మూలికలతో ఏయే క్షుద్ర వ్యాధులు నివారించాలో విడమర్చి చెప్పాను. సందేహాలుంటే మా వూరు రమ్మన్నాను. నేను ఎన్ని మాటలను చెప్పినా, అన్నింటిని శ్రద్ధగా వింటూంటాడు వీరన్న. నడుమ నడుమ అతని కండ్లు చెమరుస్తున్నాయి.

''బాబూ! నీ వా కొండమీది పరమేసరుడివే'' అన్న మాటలు కొన్నివందల సార్లొచ్చాయి, అతడి నోటివెంట. ఐదోరోజు ''వీరన్నా! ఇక నేను వెళ్తా!'' నన్నాను.

''బాబూ! ఈ ఒక్కరోజూ ఆగు—నీకో మూలికను చూపిస్తా. దాన్ని మా నాయన నాకు పదేళ్ళ వయస్సప్పుడు సూచించాడు. అడికి అడి నాయన పదేళ్ళ వయసులో సూచించాడు. అట్టా ఎన్ని తరాలబట్టి జరుగుతుందదో నాకు తెలీదు.''

''ఏంటా మూలిక పేరు?''

''నాకు తెల్దు!''

నిరుత్సాహంగా ముఖం పెట్టాను—అదేదో పిచ్చి చెట్టై అయ్యుంటుందని!

''నాకు మా నాయన దాన్ని సూచించి డెబ్బయి ఏళ్ళయింది! కానీ, ఇంతవరకు ఎవ్వడూ దాన్ని గురించి అడగనేలేదు. అసలు దానిమీద శానా ఆశ పెట్టుకున్నాను. ఎవుడొచ్చి దాన్ని గురించి అడిగినా, కనీసం వంద రూపాయి అడుగుదా మనుకున్నాను.''

నాకు వీరన్న మాటలమీద ఇంటరెస్టు పోయింది.

''ఆ మూలికమీద నా ఆశలు నిరాశలయ్యాయి. ఆ మూలికను ఎవ్వరికీ సూపగూడదన్న నియమం మా కుటుంబంలో ఉంది. అది మా కుటుంబంలోనే ఉండాలి. ఎవురన్నా అడిగితే దాని ఆకులూ తీగలూ ఇయ్యాలన్న నియమం ఉంది.''

నాకు విసుగొచ్చేసింది.

''నా పిల్లోళ్లో ఎవుడికి దాన్ని గురించి సెప్పినా, శత్! మాకొద్దీ మూఢనమ్మకాలులని అంటుండారు!''

''. . . . . .''

''అది అచ్చు తెల్లీశ్వరిలా ఉంటుంది. అయితే దానికి ఈశ్వరిలా కాకుండా ఆకు దుంపితే సర్రున పాలు గార్తాయి!''

వీరన్న చెప్పిన ఆ మాటలతో నా మెదడులో మెరుపులు మెరిశాయి. చకచకా అనేక శ్లోకాలు మెరిశాయి !

''వార్ధక్య దోష హరణాయ రసాయనాఖ్యా
సూతేంద్ర బంధవధ జారణ కర్మణిష్ఠా.''

వార్ధక్య దోషాన్ని పరిహరించి, రసాయనంలా పని చేస్తూ సూతేంద్రానికి (పాదరసానికి) బంధకర్మ, వధకర్మ, జారణకర్మల్లో ఉపయోగపడే చతుష్షష్టి దివ్య మూలికలలోని ఈశ్వరవల్లీ అన్న దివ్య మూలికను గురించే వీరన్న చెబుతున్నాడా? అని ఆశ్చర్య పోయాను.

ఈశ్వరవల్లీని గురించిన శ్లోకం ఇది:

శ్లో. ఈశ్వరీత్యుచ్యతే కాచి దీశ్వరీతుల్య రూపిణీ
భూరి క్షీర పరిస్రావా సబీజ రసబంధినీ !

(ఈశ్వరీలాగా ఉంటుంది. పాలు సమృద్ధిగా స్రవిస్తుంది. అభ్రజారణమైన పాదరసాన్ని బంధిస్తుంది ! )

వెంటనే నేనూ, వీరన్నా బయలుదేరాం.

అడవిలో చాలాదూరం వెళ్ళాం ఇద్దరం. ఆఖరుకు వీరన్న గుట్టగా పోసి ఉన్నట్లున్న గండ శిలల గుట్ట దగ్గర నిలబడ్డాడు.

''ఇందులో ఉంది ఆ మూలిక'' అన్నాడు వీరన్న.

''అసంభవం! ఇవ్వన్నీ గండశిలలు! ఇక్కడ ఏమాత్రం పసరు గూడా లేని గడ్డి జాతులు తప్ప విస్తారంగా పాలుగారే తీగ మొలవదు. మొలిచినా బ్రతుకదు'' అన్నాను నేను, నిరుత్సాహంగా.

వీరన్న సన్నగా నవ్వి అన్నాడు:

''ఇందాకట్నుంచీ దీన్ని గురించి నీకు సెబదామా వద్దా అని పీకుతున్నది మనస్సు. ఇప్పు డిక ఆ బాధ లేదు. ఎట్టాగూ నా కొడుకుల కీ సంగతి పట్టదు. ఇక ఈ రహస్యాన్ని నీ వంశంలో చేర్చు. మా వంశంవాళ్ళు కాపాడినట్టు కాపాడు! పద!'' అంటూ వీరన్న గండశిలలను ఎగ్రబాకుతూ, వెనుక వస్తున్న నాకు చేయూత నిస్తూ ముందుకు సాగిపోతున్నాడు.

అపూర్వరుచి! -తియ్యదనం!

స్వస్తిక్స్


స్వస్తిక్స్‌వారి అతిరుచికరమైన గులాబ్ జామున్ మిక్స్

ఉచితం
ఒక్కొక్క 200 గ్రాం. ప్యాకెట్‌తో స్త్రీలకు చేతిగుడ్డ ఒకటి ఇనామ్
ఒక్కొక్క 100 గ్రాం. ప్యాకెట్‌కు ఒక నోటు పుస్తకము ఇనామ్

స్వస్తిక్ బంగారువన్నె
గులాబ్‌జామున్ రుచి
అనితరము, అపూర్వము,
మనోహరము
మామూలు భోజనాన్నయినా
విందుగా మార్చగల
వంటకం




స్వస్తిక్స్ కెమికల్
ఇండస్ట్రీస్
స్వస్తిక్ హవుస్
23/1, జైన్ టెంపుల్ స్ట్రీట్,
వి.వి. పురం,
బెంగుళూరు-560 004




అలాగా ఆ శిలలను ఎక్కుతూ, శిలల నడుమ గుహలుగా ఏర్పడిన సందుల్లోంచి పాక్కుంటూ వెళ్తున్నాము. యాభై అడుగుల దూరం ఎక్కగానే ఒక పెద్ద బండమీద ఈశ్వరిలాంటి తీగ అల్లుకుని ఉంది. దాని ఆకును తెంపి చూశాను. జలజలమంటూ తెల్లగా పాలు కారాయి.

'సో, ఈశ్వరీవల్లి అన్నది అబద్ధం కాదన్న మాట!' అనుకున్నాను.

''ఇదే నీవనుకున్న చెట్టా?'' అడిగాడు వీరన్న ఒక తీగను చూపిస్తూ.

''అవును!''

''ఇది దేనికి పనికివస్తుంది?''

''అదే సరిగా తెలియదు!'' అన్నాను కొంత గర్వంగా!

సందేహంగా వీరన్న నావంక చూశాడు. నేను వీరన్నను పట్టించుకోకుండా ఆ తీగ ఎక్కడ పుట్టిందా అని వెతుక్కుంటూ, బండ చుట్టూ తిరుగుతూ ఉంటే, తీగకు తగులుకొని నా మెడలోని బంగారు గొలుసు తెగి బండల మధ్యగా పడి పోయింది!

ఆ సంగతి వీరన్నకు చెప్పాను.

''ఎన్ని సవర్లుంటది'' అడిగాడు వీరన్న.

''మూడు!''

''సరే ! ఎదుకుదాం పద!'' అంటూ వీరన్న బండల సందుల్లోంచి పాములాగా జారిపోతున్నాడు. అతనివెంట నేను అతి కష్టంగా వెళ్తున్నాను. చాలా సేపు వెతికి వేతికి వేసారి నిస్పృహతో నేను కూర్చుంటే, వీరన్న పట్టుదలగా మరో గంట వెతికి ''బాబూ! దొరికింది! రా!'' అన్నాడు.

నేను లేచి వీరన్న దగ్గర కెళ్ళాను. వీరన్న ఒక పెద్ద బండక్రింద చిక్కుకుని అంగుళంమాత్రం బయటకు కనుపిస్తున్న నా దండను పట్టుకుని ఉన్నాడు.

''లాగు!'' అన్నాను.

''లాగితే తెగుద్ది! బండ ఎత్తుదాం పట్టు!''

ఆ బండ మా ఇద్దరికీ లేచేలా లేదు.

అయినా ప్రయత్నించాం.

ఒక పది నిముషాలలో బండ లేచింది. బండ కింద గుహాద్వారంలాగా ఉంది. బండ లేవగనే బంగారు గొలుసు జారి ఇంకా క్రిందకు పోయింది.

వీరన్న దానివెంట లోని కెళ్ళాడు.

''బాబూ! ఈడ...మనిషుండాడు...ముసలోడు'' అన్నాడు వీరన్న ఆర్తనాదం చేసినట్లుగా.

నా గుండె ఝల్లుమంది. 'శవమా? మర్డరా?' అని వితర్కించుకుంటూనే వీరన్న ప్రక్కన చేరాను.

ఎదురుగా ఉన్న గుహలో ఒక తేజోమూర్తి అయిన ముసలి సాధువు ఉన్నాడు—పద్మాసనంమీద. అతనివంక ఆశ్చర్యంగా చూస్తుంటే కొన్ని క్షణాలు జరిగిన తరువాత ఆ కండ్లు తెరుచుకున్నాయి.

నాకు భయం పుట్టింది. ఆ కండ్లు ప్రశాంతంగా తెరుచుకున్నా క్రమంగా అరుణిమను దాల్చాయి!

''ఏ యుగం జరుగుతుంది?'' అడిగాడు సాధువు కోపంగా.

ఇంగ్లీషు మానాలో సంవత్సరం, నెల, తారీఖు చెప్పాను.

సాధువులో విసుగు, అర్థం చేసుకోలేని లక్షణాలు కనుపించాయి.

వెంటనే ఆయనకు అర్థం కావాలంటే ఎలా చెప్పాలో స్ఫురించింది. కలియుగే ప్రథమ పాదే జంబూద్వీపే, భరత వర్షే, భరతఖండే మేరో దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ... ఆగ్నేయ ...

''ఛీ! ఛీ!! ఇంక ఆపు! బండ మూసేసి వెళ్ళిపో! ఇది రహస్యంగా ఉంచు. లేకుంటే సర్వనాశనమై పోతావు!'' అంటూ కండ్లు మూసుకున్నాడు.

బండ మూసి పారిపోదా మన్న ప్రయత్నంలో మేముంటే, సాధువు మళ్ళీ కండ్లు తెరిచి నాతో—

''ఆన లెంటు కొచ్చారు ఇక్కడికి?'' అడిగాడు సాధువు.

''మూలికలకోసం!'' భయంగా చెప్పాను.

''ఏ మూలికకోసం?''

''ఈశ్వరవల్లి ...''

ఆ సాధువు నా వంకా, వీరన్న వంకా చాలాసేపు పరిశీలించి చూశాడు.

''హూఁ! ఈశ్వరవల్లికోసం వచ్చావా? ఏం చేదా మనుకుంటున్నావ్?''

''వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు ...''

''ఆపు నీ అబద్ధాలు!''

''. . . . .''

''రసవాద ప్రయోజనంకోసమే గదూ?''

''అ...వు...ను...''

''ఆ మూలికతో ఏం చేదా మనుకుంటున్నావ్?''

''ఆ మూలిక సబీజ రసాన్ని బంధిస్తుందని తెలుసుకున్నాను. కానీ అలాంటి మూలిక ఉందా, లేదా అన్న జిజ్ఞాస వరకే నా ప్రస్తుత అన్వేషణ. రసాన్ని బంధిస్తే ఆ తరవాత ఏం చేయాలో నాకు నిజంగా తెలియదు.''

సాధువు సంతృప్తిగా నవ్వాడు.

''నీవు ఎంతో పుణ్యాత్ముడివి గనుక మూలికా దర్శనం జరిగింది. తరవాత మా దర్శనం జరిగింది. నీ జన్మ కిది చాలు! ఇంతకంటే ఎక్కువగా ప్రయత్నిస్తే, నీకు సర్వనాశనం జరిగిపోగలదు! సిద్ధుల అనుగ్రహం లభించింది. వాదవిద్య ఫలించదు. సిద్ధుల అనుగ్రహం కావాలంటే, వారి ఎత్తుకు ఎదగాలి. కనీసం వారిని నీ తపోశక్తితో సంతృప్తి పరచాలి. అది ఈ కాలంలో మీ లాంటి భ్రష్టులకు లభించదు!''

''అయితే, స్వామీ, రసవాద విద్య ఉందా?''

''మూలికా దర్శనం జరిగిన నీకు అనుమాన మేనా?''

''. . . .''

''పిచ్చివాడా! హస్తినాపురంలోని అశోకస్తంభం లాంటి, తుప్పుపట్టని ఇనుమును, ఒక్క తులం ... ఏదీ? ... ఒక్క తులం చేయగల్గిన నాడు మీకు మా ప్రజ్ఞ తెలియగలదు. ఇక, రసవాద విద్య నశిస్తుం దంటావా? నశించిపోయిందంటావా?! అహ్హహ్హా! వాదవిద్య, వేద విద్య ఒక్కటే! అవి నశించవు! నాశ రహితమైనవి అవి. అందుకే వాటిని శ్రుతు లన్నారు. అంటే వినబడేవి. కాలాంతరంలో అవి భవిష్య మానవులకు వినబడతాయి. ఇక వాటికి నశింపెక్కడ? అవి నశిస్తాయనీ, వాటిని రక్షించాలనీ అల్ప మేధస్కులైన మీ యారాటమా?'' అన్నాడు సాధువు.

సాధువు మాటలలో కొంత భరోసా చిక్కినప్పటికీ, నమ్మ సాధ్యం కాలేదు.

''స్వామీ! చతుష్షష్టి దివ్యమూలికలలో ఒక దాన్ని చూశాను. మిగతా అరవై మూడు కూడా ఉన్నా యంటారా?''

''అన్నీ సలక్షణంగా ఉన్నాయి. అవి సృష్టిలో సహజంగా పుట్టినవికావు! వాటిని మా లాంటి సిద్ధ పురుషులు సృష్టించారు.''

''మీరు చెట్లను సృష్టించారా?''

''అవును! రసబంధ, మారణ ప్రక్రియలలో తామ్రం అవసరం. సహజ తామ్రాన్ని శ్వేతభస్మంగా చేయడం దాదాపు అసంభవం! అందువల్ల సహజం

లోనే తామ్రాన్ని పుట్టించే ఉద్దేశంతో, తామ్రం పాలు హెచ్చుగా ఉన్న మొక్కలను అనేక ప్రక్రియల ద్వారా వాటి స్వభావాన్ని హెచ్చించేందుకై ఈ దివ్య మూలికలను సృష్టించాము. అవి ఎక్కడబడితే అక్కడ నీకు దొరకవు! సిద్ధ రక్షితమై సులక్షణంగా ఉన్నాయి.''

''స్వామీ! చాలా అన్యాయం. ఇన్ని మహత్తర విద్యలను కలిగి ఉండికూడా ఈ భారతదేశంలో దరిద్రం తాండవిస్తున్నది. కూటికి లేక, అలో లక్ష్మణా అని లక్షలాది మంది అలమటిస్తున్నారు. మరి మీ వ్యర్థమైన, స్వార్థ పూరితమైన తపస్సును మానుకుని మీ విద్యలద్వారా—దేశాన్ని రక్షించరాదా?'' ఇలా చాలా ఆవేదనగా ఆ స్వామిని అడిగాను.

స్వామీజీ కండ్లు ఎర్రగా అయినాయి. శపిస్తాడని భయపడ్డాను. అంతలోనే ఎక్కడలేని తెగింపు పుట్టుకు వచ్చింది. లక్షలాది, కోట్లాది భారతీయుల హృదయాలలో శతాబ్దాలుగా మరుగుతున్న ఆవేదనను ఆయనకు ఎరుక పరుస్తున్నానన్న తృప్తి నాకు ధైర్యాన్నిచ్చింది. నిర్భయంగా ఆయన కండ్లలోకి చూశాను.

''క్షుద్రుడా! నిన్ను చూసిన వెంటనే పంపివేయవలసింది! అయినా, ఎలాగో తపోభంగం అయింది! సరే! పూర్తిగా విను.

ఇప్పటికి వేయి సంవత్సరముల క్రితం భారతదేశం సస్యశ్యామలంగా ప్రపంచంలోని అన్ని దేశాలకంటే భాగ్యవంతంగా ఉండేది. బంగారం మొదలైన వస్తువులు విరివిగా లభ్యం అయాయి. జనంలో అలసత్వం ఏర్పడింది. భోగలాలసత విస్తరించింది. స్వార్థం కట్టలు తెంచుకుని ప్రవహించింది. కానీ ఆ నాడు ... బంగారం నగల కొట్లవలె, వీధికో రసాయన శాల ఉండేది. అందులో బంగారంలాంటి విలువైన లోహాలు తయారై ప్రజలకు పంపిణీ చేయబడింది! కానీ —

ఒకప్పుడు అనేకసార్లు ఒక దేవాలయంపై దాడి జరిపి అనేక ఒంటెలమీద బంగారాన్ని తరలించుకొని వెళ్ళాడు. భారత ప్రజ లేం చేశారు? ఏమీ చేయలేదు!

ఆ తరువాత అనేకసార్లు అలాగా జరిగింది. భారతీయులు బలహీనులైనారు. దేశాన్ని ఇతరులకు అమ్మడానికి వెనుతీయలేదు


ఈ పరిస్థితి ఏమైనా మారుతుందేమోనని కొంతకాలం చూశాం. లేదు. ఇది దీర్ఘకాలం జరిగే ఘోరం అని నిర్ణయించుకుని రసాయన శాలలు మూసివేశాం. రస గ్రంథాలలోని ముఖ్య భాగాలను ఎత్తివేశాం. ఈ విద్యలు ఇతరుల చేతిలో పడినా, వాళ్ళను గంగలో ముంచేలాగున అపమార్గాలను శాస్త్రాలలో ఉంచాం. సరే! ఈ రోజున గుండె మీద చేయి వేసుకుని చెప్పు. ఈ వాద రహస్యాన్ని నీకు చెబుతాను. దీనిని విదేశీయుల చేతిలో పడకుండా రక్షించే ఆత్మ నిగ్రహం నీకుందా?''

నాకు వెంటనే ఆశ పుట్టింది. అయినా ఈ దేశంలో విలువైనవన్నీ విదేశాలకు వెళ్ళిపోతున్నాయి. ఒకవేళ ఈ విద్య నా చేత పడితే సిద్ధులవలె దానిని రక్షించగలనా అన్న అనుమానం పుట్టింది.

''స్వామీ! మీ ఆరాటం అర్థమైనది. ఈ దేశంలో విలువైనవన్నీ విదేశాలకు ధారాప్రవాహంగా వెళ్ళిపోతూనే ఉన్నాయి! వాటిని ఆపాలన్న భావం గూడా ఎవరికీ కలుగడం లేదు. ఈ దేశంనుండి విజ్ఞానవంతులు వెళ్ళిపోతున్నారు. ఆఖరుకు పేద ప్రజలు తినే ఉల్లిపాయలు సహితం వెళ్ళిపోతున్నాయి, స్వామీ! ఈరోజున డాలర్, పౌండ్ ప్రపంచాన్నేలుతున్నాయి. వాటిముందు అందరూ తల వంచవలసినదే.''

''అందుకనేరా! ఈ రసవాద విద్యను భ్రష్టులైన భారతీయులకు అందజేయం. భారతదేశాన్ని పీడించే విదేశీయుల నాశనం త్వరలో జరుగుతుంది. అట్టి అర్థాయుష్కులను సమర్థించేవారి నాశనం కూడా త్వరలో జరుగుతుంది. ఆ తరువాత మా విద్యలతో భారతదేశంలో ప్రవేశిస్తాం—ప్రపంచాన్ని ఏలుతాం!

అన్నట్లు నీకు బంగారం కావాలా?''



''అవును, స్వామీ. కావాలి!'' అన్నాను నేను ఆశగా.

''శ్రీ సూక్తం వచ్చా నీకు?''

''వచ్చు, స్వామీ!'' అంటూ హిరణ్యవర్ణాం హరిణీం అంటూ చదువుతున్నాను.

''ఆపు'' అన్నాడు యోగి!

ఆపాను!

''ఒరే, వెధవాయ్! హిరణ్యవర్ణాం హరిణీం అంటూ నీవు చదివిన ఆ మంత్రంలోని లక్ష్మి పూలూ బుక్కాయిల పూజతో, కొబ్బరికాయల నైవేద్యంతో లొంగుతుందట్రా?!''

''లక్ష్మి అమ్మవారు దయ తలుస్తుందనే మా ఆశ!''

''ఒరే! ఒక్క సంగతి అడుగుతాను! చెప్పు!''

''అడగండి, స్వామీ!''

''ఆ సూక్తద్రష్ట అయిన ఋషి—జాతవేదోమ ఆవహ అంటూ లక్ష్మిని పిలవడానికి జాతవేదుడ్ని— అంటే అగ్నిహోత్రుడ్ని ప్రాథేయపడ్డా డెందుకని?, నేను దిగ్భ్రమ చెందాను.

అవును! లక్ష్మీదేవి దయ కలుగాలంటే విష్ణువును ప్రార్థించాలి. కనీసం నారదుడ్నయినా దేబిరించాలి. లేదా, త్రిమూర్తులను గానీ, వారి భార్యలనుగానీ ఆశ్రయించాలి. మరి వేద మంత్రద్రష్ట అగ్నిహోత్రుడ్ని ఆశ్రయించమని ఎందుకు చెప్పాడు? అగ్నిహోత్రుడికి, లక్ష్మి అమ్మవారికి ఏం సంబంధం? ఇలా ఆలోచిస్తుంటే—

''రేయ్! అర్థం చేసుకో! 'చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం, జాతవేదోమ ఆవహ!' అంటే తెల్లగా వెండివలె ఉన్న లక్ష్మిని పసుపుగా, బంగారు వర్ణంగా చేయగలిగినవాడు ఈ సర్వ సృష్టిలో అగ్నిహోత్రుడే! అంటే అగ్నిలో తెల్లగా ఉన్న వెండిని పెట్టు! అగ్నిహోత్రుడ్ని ధ్యానించు. తెల్లని లక్ష్మి హిరణ్మయీం అయిపోతుంది!''

''అర్థం కాలేదు, స్వామీ!''

''ప్చ! అమాయకతను నటించకు. ఒక మూస తీసుకుని వెండిని కరుగు. అగ్నిలో బంగారం అవుతుంది!''

''వెండిని కరిగించినంత మాత్రాన బంగారం అవుతుందా?''

''కాదని—అందరికీ తెలుసు! అయితే ఆ కరిగిన వెండిపైన ఏదో వేయాలి!''

''ఏం వేయాలి, స్వామీ?!''

''చెప్పమంటావా?''

''చెప్పండి!''

''సరే! బంగారం తయారయ్యే సూత్రాన్ని చెప్పమంటావా?!''

''చెప్పండి, స్వామీ!''

నాలోని ఆత్రతనూ, ఆశనూ అసహ్యంగా చూస్తూ స్వామీ అన్నాడు:

''సరే! విను!

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః

గురుసాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురువేనమః
''ఇదా! బంగారం చేసే ఫార్ములా!''
''ఇదే!''
''నమ్మకం కలగడం లేదు, స్వామీ!''
''మూర్ఖుడా! 'శ్రీ గురుః సర్వ కారణభూతాశక్తి. నగురో రధికం! నగురో రధికం! నగురో రధికం! శివ శాసనత:

శివశాసనత: శివశాసనత: అని ఉపనిషత్తులు ఘోషిస్తూ ఉంటే గురువును—విద్యచెప్పే గురువును హేళన చేసే క్షుద్ర యుగం ఇది! ఛీ! ఇక నీవు పో. గురువుకు పూజలూ, గౌరవాలూ జరిగేదాకా ఈ దేశానికి నిష్కృతి లేదు!''

''స్వామీ!. . . స్వామీ!. . . మన్నించండి! మీరు చెప్పిన శ్లోకం అందరికీ తెలుసు. కానీ అదే బంగారం చేసే ఫార్ములా అని ఎవ్వరికీ అనుమానం కూడా రావడం లేదు!''

''ఎందుకొస్తుంది? ! శ్లోకం అయితే తెలుసును గాని, గురువును బ్రహ్మవిష్ణుమహేశ్వరులుగా భావించ గల వా రెందరున్నారు?''

''మీరు చెప్పింది నిజమే కావచ్చు. కానీ ఈ రోజుల్లో నిజమైన గురువులు లేరు. అంతా దొంగ వెధవలు—జీతాలకోసం,డబ్బుకోసం శిష్యులను వేధించే వారే ఎక్కువ.''

''నీచుడా! క్షుద్రుడా! వెళ్ళిపో!''

స్వామీజీ కండ్ల నుండి విస్ఫులింగాలు రాలుతున్నాయి!

క్రోధంతో, నాపై ద్వేషంతో అతడి దేహం కంపించిపోతున్నది.

''స్వామీ, మన్నించండి. మీ కోప కారణం తెలియదు. మిమ్ములను అవమానించడం గానీ, మీకు కోపం తెప్పించడంగానీ నా అభిమతం గాదు. కానీ భాష—నా భాష మీకు అర్థం కాకపోయి ఉండవచ్చు. ఏ భాషలో సౌమ్యంగా ఎలా మాట్లాడాలో నాకు తెలియదు. క్షమించండి! రక్షించండి'' అంటూ ఆ స్వామి కాళ్ళు పట్టుకున్నాను!

ఆ స్వామి తత్తరపాటుతో నా చేతులు ఆయన కాళ్ళను తాకకుండా చూడాలని వెనక్కు వెనక్కు జరిగాడు. అయినా నా చేతులు అతని పాదాలను స్పృశించనే స్పృశించాయి.

''మూర్ఖుడా! విద్యను చెప్పే గురువు ఎప్పుడూ గురువే! శివస్వరూపుడే. అతడి గుణ దోషాలను విమర్శించడానికి నీవెవ్వడివి? ఆ! అన్నట్లు! నీ కో గురువు ఉన్నాడా?''

''ఉన్నారు, స్వామీ!''
''ఎవడు?''
''నా తండ్రి!''
''ఎంతవరకు చదువుకున్నాడు?''
''ఐదు క్లాసులు!''
''నీవెంత చదివావు?''
''ఎమ్.ఎ. ఫస్ట్ క్లాస్!''

''అంటే, నీ గురువుకంటే నీవు గొప్పవాడి వయ్యావా?''

''లేదు, స్వామీ! నా గురువు, నా తండ్రి ఐదు క్లాసులు చదువుకున్నా ఆయనయే నా అభ్యున్నతికి కారణం అయినందున, ఆయనకంటే నేను తక్కువ అనే అనుకుంటున్నాను!''

''శభాష్! అందువల్లనే మాలాంటి దివ్యపురుషుల దర్శనం నీకు లభించింది. చాలామంది మూర్ఖులు ఆదిశంకరులంతటి గురువులు కావాలని ఏడుస్తారు. కానీ ఆదిశంకరులలాంటి గురువులు పద్మపాదుల లాంటి శిష్యులకే లభిస్తారు!''

''స్వామీ! ఆ గురు. . . శ్లోకంలో బంగారం... ఫార్ములా...!''

స్వామీజీ నవ్వారు!

''చెప్తానురా! చెప్తాను. నీలాంటి క్షుద్రుడికి ఎన్ని సంవత్సరాలు, యుగాలు చెప్పినా గురుమంత్ర రహస్యం అర్థం కాదు! కనుక నీకు చెప్పినా నష్టం లేదు! మరోసారి ఆ గురుమంత్ర శ్లోకాన్ని స్మరించుకో!''

గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మతస్మై శ్రీ గురువేనమః
ఇలా స్మరించుకుంటూంటే—

''రేయ్! నీ శ్లోకంలో పరబ్రహ్మ అని వచ్చింది గదా?! ప్రతివేద మంత్రానికి వేదార్థం, వాదార్థం అని ఉంటాయి! అందులో వాదార్థం ప్రకారం పరబ్రహ్మ అంటే మేలిమి బంగారం! ఇరవైనాలుగు క్యారట్ల బంగారం! సిద్ధ బంగారం! భూమిలో నుండి తీసినబంగారంకంటే, రెండు వన్నెలుహెచ్చు.''

''స్వామీ! అర్థం కాలేదు! పరబ్రహ్మ అంటే మేలిమి బంగారం అన్నారు! కానీ అది ఎలా సాధ్యం?''

''ఎలా సాధ్యం అంటే—సద్గురు చరణాలు పట్టుకో! ఆ గురువు నిన్ను బ్రహ్మ దగ్గరకు చేరుస్తాడు. బ్రహ్మ విష్ణువు దగ్గరకు చేరుస్తాడు విష్ణువు శివుని దగ్గరకు చేరుస్తాడు. శివుడు పరబ్రహ్మంలోకి చేరుస్తాడు.''

''స్వామీ! అర్థం కాలేదు. మీరు చెప్పేది వేదాంతం నిర్వాణ మార్గం. దీనికీ.. .బంగారానికీ...''

''మూర్ఖుడా! వేదం — వాదం రెండూఒకటే పరబ్రహ్మంఅంటే మేలిమిబంగారం అన్నాం కదా?''

''అన్నారు. అది తెలిసింది. కానీ ...''

''సరే! ఇంకో చిన్న సాయం చేస్తాం! గురుదేవో మహేశ్వరః అన్నాం కదా! మహేశ్వరుడంటే సవీరం! అంటే పాదరసం! కనుక, గురువును పట్టుకో, వాడితో బ్రహ్మను కలుపు! ఆ ఇద్దరికీ విష్ణువును కలుపు! ఆ ముగ్గురికీ మహేశ్వరుడ్ని కలుపు — 'పరబ్రహ్మం' అవుతుంది! అంటే వేదార్థం ప్రకారం పరబ్రహ్మ దొరుకుతుంది! వాదార్థం ప్రకారం బంగారం దొరుకుతుంది!''

''స్వామీ! రెండు సంగతులు చెప్పారు! మహేశ్వరుడంటే సవీరం పాదరసం అన్నారు. పరబ్రహ్మ అంటే మేలిమి బంగారం అన్నారు. కానీ పూర్తి యోగం నాకు చిక్కినట్లు అనిపించడం లేదు.''

''రేయ్! నీవు చాలా పోకిరివాడిలాగా అనిపిస్తున్నావ్? సిద్ధ రహస్యాలను పొందాలన్న ఆకాంక్ష నీకు ఉంది. కానీ సిద్ధులు శిష్యులయందు మాత్రమే దయార్ద్ర హృదయులు.''

''స్వామీ! నన్ను శిష్యుడిగా అంగీకరించండి.''
''ఊహూ, నీవు నాకు శిష్యుడిగా పనికిరావు.''
ఖిన్నుడయ్యాను.
దిగాలుగా ఆ స్వామి వంక చూస్తున్నాను.
స్వామి ముఖంలో మందహాసం వెలువడింది.

''ఊ! ... నాయనా! ఈ యుగధర్మం ... చాలా చెడ్డది... దేనియందు నమ్మకం లేక, నమ్మినా, సంశయంతో బాధలుపడే క్షుద్రులతో దేశం నిండి ఉంది. గురుమంత్రాన్ని పదికోట్లుసార్లు జపించు! అప్పుడు ఆ పరమేశ్వరుడు గురు స్వరూపంతో దిగి వస్తాడు! ఆనాడు నీకు వేదం, వాదం కరతలామలకం కాగలదు ... ఇక వెళ్ళు.''

నేను, వీరన్న బండమూసి బయలుదేరాం.

గురుమంత్రాన్ని జపిస్తూ వాచీ చూసుకున్నాను.

ఒక్కసారి జపించడానికి పది సెకండ్లు పట్టింది!

అంటే — నిముషానికి ఆరుసార్లు, గంటకు మూడొందల అరవైసార్లు, రోజుకు ఎనిమిదివేల ఆరువందల నలభైసార్లు. సంవత్సరానికి — ముప్పై ఒక్క లక్షల యాభై రెండువేల ఆరువందలసార్లు, పది సంవత్సరాలకు మూడుకోట్ల పదిహేను లక్షల ఇరవై ఆరువేలసార్లు. అంటే ముప్పై సంవత్సరాలు అహోరాత్రాలు జపిస్తేగాని పదికోట్లసార్లు కాదు.

గుడ్ గాడ్!

రోజు కో పది నిముషాలు తూ— తూ— మంత్రంగా ఇష్టదేవతను పూజిస్తూ ఆ మాత్రం గూడా చేయని వారికంటే నేను చాలా ఘనుడ్నన్న అహంకారం కలిగిన నాకు అంతటితో గర్వభంగం అయింది.

గురుమంత్రానికే ఇంత కాలమా?

ఇక ఆ గురువు చెప్పే సాధన ఇంకెంత కాలం పడుతుంది?

క్రమంగా యుగధర్మం నన్నాక్రమించడం మొదలెట్టింది.

అంతా 'బోష్! 'నాన్సెన్స్!' అనిపించి, మనస్సును ఆకట్టుకుంది.

తర్వాత చాలా సంవత్సరాలు మూలికా జిజ్ఞాస నశించింది.

తర్వాతవో సంవత్సరం క్రితం మళ్ళీ 'ఆ కొండకు' వెళ్ళాను. వీరన్న మరణించి చాలాకాలం అయింది.

మూడు రోజులపాటు కొండంతా గాలించినా ఈశ్వరీవల్లిగానీ, స్వామీజీ ఉన్న గుహకు మూయబడిన బండగానీ కనిపించలేదు.

నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది— మొదటిసారి నేను స్వామీజీని కలవడం— నిజమా? కలా? అని.

## ఈనాటిదా ఈ మూర్ఖం?

భార్యాభర్తల మధ్య మళ్ళీ వివాదం ప్రారంభమైంది. పరస్పరారోపణలు తుపాకి తూటాల్లా దూసుకుపోతున్నై. చివరకు భర్త—''నిజమే, నిజమే. నా అంతటి మూర్ఖుడు మరొకడుండడు. నిన్ను వివాహమాడడానికి నేను ఒప్పుకున్న నాడే నీ కా విషయం తెలిసిపోయి ఉంటుంది'' అని ముగించాడు.

- ప్రవీణ్